క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే కళావతి ప్రచారం

పాలకొండ రూరల్: మండలంలోని బుక్కూరు, టీకే.రాజపురం పంచాయతీల్లో ఆదివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, నియోజకవర్గ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఎన్నికల ప్రచారం చేయనున్నట్టు పార్టీ మండల కన్వీనర్ కనపాక సూర్యప్రకాష్ శనివారం తెలిపారు. పార్టీ శ్రేణులు పాల్గొని విజయయంతం చేయాలని కోరారు.

ఎండలతో బెంబేలు..

గుమ్మలక్ష్మీపురం: ఇంట్లో ఉంటే ఉక్కపోత.. బయటికొస్తే ఎండ వేడిమితో మండల ప్రజలు శనివారం కూడా అవస్థలు పడ్డారు. ఉష్ణోగ్రత గరిష్ట స్థాయిలో నమోదవ్వడంతో పనుల నిమిత్తం బయటికి కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. తప్పని పరిస్థితుల్లో బయటకు వస్తున్న వారు ముఖానికి మాస్కులు, నెత్తిన టోపీలు, గొడుగుల సాయం తీసుకుంటున్నారు. వేసవి తాపానికి ప్రయాణికులు శీతల పానీయాలు, కొబ్బరిబొండాలు సేవించి సేద తీరుతున్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పార్వతీపురంటౌన్: రానున్న ఎన్నికల నేపథ్యంలో అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆర్డీఓ, పార్వతీపురం ఎన్నిలక అధికారి హేమలత ఆదేశించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను శనివారం ఆమె పరిశీలించారు. ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, విద్యుత్, ర్యాంపులు, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం పోలింగ్‌కు సంబంధించిన సామగ్రిని పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ఆమె వెంట తహసీల్దార్ కె.ఆనందరావు, ఆర్ఐ రామకృష్ణ ఉన్నారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

మక్కువ: మండలంలో శుక్రవారం సాయంత్రం ఈదురుగాలులుతో కూడిన వర్షానికి పలుచోట్ల చెట్టుకొమ్మలు విరిగిపడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్‌శాఖ సిబ్బంది తక్షణమే స్పందించి చెట్టుకొమ్మలు తొలగించి, లైన్లు సరిచేశారు. యుద్ధప్రాతిపదికన విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు చేపట్టారు.

అబద్ధాల చంద్రబాబుని నమ్మొద్దు



గడివలసలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న రెడ్డి పద్మజ

సాలూరు రూరల్: అబద్ధాలే అజెండాగా ప్రజలను మోసం చేస్తున్న తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు మాటలు నమ్మొద్దని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ రెడ్డి పద్మజ అన్నారు. కరాశువలస పంచాయతీ గడివలస గ్రామంలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు చేసిన మోసాలను, జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను, అభివృద్ధిని వివరించారు. గడపగడపకు సంక్షేమ పాలన అందుతోందన్నారు. నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసుకునేందుకు, సంక్షేమ పాలన కొనసాగించేందుకు రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి రాజన్నదొరను భారీ మెజార్టీగా గెలిపించుకుని జగనన్నకు కానుకగా ఇద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శివరాంపురం ఎంపీటీసీ కళ్లేపల్లి త్రినాథనాయుడు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుపై ఓటేసి సంక్షేమ పాలనకు పట్టం కట్టండి

సాలూరు: రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ప్రజా సంక్షేమ పాలనకు పట్టం కట్టాలని, జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని డిప్యూటీ సీఎం, సాలూరు అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పీడిక రాజన్నదొర ఓటర్లను అభ్యర్థించారు. పట్టణంలోని 6వ వార్డు కోటవీధి, శివాలయం వీధిలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా స్థానిక అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వార్డులో పర్యటించిన ఎమ్మెల్యేకు మహిళలు, స్థానికులు పూలమాలలు వేసి, హారతులు ఇచ్చి ఆత్మీయ స్వాగతం పలికారు. ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. అన్ని వర్గాలకు మంచి చేయడమే సీఎం జగన్ అజెండా అని, పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించారని గుర్తుచేశారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసం చేసి, ఇప్పుడు ఎన్నికలు రావడంతో బూటకపు హామీలతో మరోసారి చంద్రబాబు ప్రజల మధ్యకు వస్తున్నారని, ఆయన మాటలు నమ్మి మోసపోవద్దని కోరారు. మీకు మంచి జరిగిందని అనిపిస్తే ఈ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా తనూజారాణిని భారీ మెజార్టీతో గెలిపించి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు నాయిబ్రాహ్మణులు రాజన్నదొరకు ఘనంగా సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. జై జగన్, జై రాజన్నదొర నినాదాలతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. కార్యక్రమంలో పార్టీ నాయకులు గిరి రఘు, రాపాక మాధవరావు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రజా సంక్షేమ ప్రభుత్వం



బురుజోలలో పార్టీ నాయకులతో కలసి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే కళావతి

- ప్రచారంలో ఎమ్మెల్యే కళావతి

భామిని: రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో ప్రజా సంక్షేమ పాలన నడుస్తోందని, ఈ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో మరో అవకాశం ఇవ్వాలని పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. ఇచ్చిన హామీలు శతశాతం అమలు చేసిన జగనన్న ప్రభుత్వానికి అండగా నిలబడాలన్నారు. సొసైటీ డైరెక్టర్ కాగితాపల్లి కృష్ణారావు, వైస్ ఎంపీపీ బోనగడ్డి ధర్మారావు, సర్పంచ్‌లు మడపాన కేశవ ఆధ్వర్యంలో దిమ్మిడిజోల, పసుకుడి, బురుజోల గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ప్రతీ ఇంటికి నవరత్నాల పేరున అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించి పేదరిక నిర్మూలనకు చేయూతనిచ్చారన్నారు. గిరిజనుల పోడు భూములకు ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలు అందించి రైతు భరోసా ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. దిమ్మిడిజోలలో మహిళలు ఎమ్మెల్యే కళావతికి హారతుల పట్టి ఘన స్వాగతం పలికారు. బురుజోలలో బొట్టు పెట్టి ఇంటింటికి ఆహ్వానించారు. పార్టీ నాయకులు తోట సింహచలం, కొత్తకోట చంద్రశేఖర్, కొవ్వాడ చిరంజీవులు, టింగ అన్నాజీరావు, మజ్జి మోహనబాబు, బోనగడ్డి ధర్మారావు, గెల్లంకి రమేష్, పత్తిక సింహచలం, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

'పద్ధతిగా మాట్లాడడం నేర్చుకోవాలి'

పాలకొండ: సినీ నటుడు పృథ్వీరాజ్ పద్ధతిగా మాట్లాడడం నేర్చుకోవాలని వైఎస్సార్‌సీపీ పాలకొండ పట్టణ ప్రధాన కార్యదర్శి వై.లిల్లీపుష్ప నాథం, 17వ వార్డు కౌన్సిలర్ దుప్పాల పానినాయుడు అన్నారు. పాలకొండలో విలేకరులతో వారు శనివారం మాట్లాడారు. పృథ్వీరాజు తీరును తప్పుబట్టారు. డబ్బుల కోసం జనసేన తరఫున ప్రచారం చేస్తున్న పృథ్వీరాజ్ ఆ పని మాత్రమే చేయాలని హితవు పలికారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే స్థాయి ఆయనకు లేదన్నారు. స్థాయిని మరచి విమర్శలు చేస్తే సహించబోమన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

వలంటీర్ల రాజీనామా

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లి గ్రామానికి చెందిన నలుగురు వలంటీర్లు రాజీనామా పత్రాలను శనివారం ఎంపీడీఓ పి.సూర్యనారాయణకు అందజేశారు. స్వచ్ఛందంగా, కులమతాలకు, రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వం మంజూరు చేసిన సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారులకు అందిస్తున్న వలంటీర్లపై టీడీపీ కూటమి నాయకులు లేనిపోని ఆరోపణలు చేసి మానసిక ఆందోళనకు గురి చేస్తున్నారని వలంటీర్లు పేర్కొన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికలలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గెలుపునకు తమ వంతు కృషి చేస్తామని వారు పేర్కొన్నారు.

ఆధ్యాత్మికతతో ప్రశాంతత

- త్రైత సిద్ధాంత ఉగాది క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. శనివారం వండవ క్యాంపు కార్యాలయానికి వచ్చిన త్రైత సిద్ధాంత ప్రబోధకులతో ఆమె మాట్లాడారు. వీరి తీసుకువచ్చిన త్రైత సిద్ధాంత తెలుగు ఉగాది క్యాలెండర్‌ను ఎమ్మెల్యే కళావతి ఆవిష్కరించారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కళావతి

పవన్ పద్ధతిగా మాట్లాడు...

పాలకొండ: సినీ హీరో సూపర్‌స్టార్ కృష్ణను విమర్శించే స్థాయి జనసేన నేత పవన్‌కు లేదని కృష్ణ, మహేష్‌బాబు అభిమానులు ధ్వజమెత్తారు. పట్టణంలోని కొండవీధిలో సూపర్‌స్టార్ కృష్ణ, మహేష్‌బాబుల అభిమానులు శనివారం సమావేశం నిర్వహించారు. ఇటీవల పవన్ కల్యాణ్ కృష్ణపై చేసిన వాఖ్యలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పవన్‌కల్యాణ్ పద్ధతిగా మాట్లాడడం నేర్చుకోవాలని సూచించారు. తెలుగు కళామ్మతల్లి ముద్దు బిడ్డ కృష్ణను పవన్, చిరంజీవి వంటివారు విమర్శించే అర్హత లేదని ధ్వజమెత్తారు. తామంతా వైఎస్సార్ పార్టీకి మద్దతుగా ఉంటామని స్పష్టం చేశారు. పవన్ ఓటమికి తామే కారణంగా మారుతామని హెచ్చరించారు. మహేష్‌బాబు, ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డిల చిత్రపటాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో అభిమాన సంఘాల నాయకులు ఎస్.తరుణ్, సురేంద్ర, ఆర్.కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి జగన్, మహేష్‌బాబు చిత్రపటాలను ప్రదర్శిస్తున్న మహేష్‌బాబు అభిమానులు

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌కు పక్కా ఏర్పాట్లు

పాలకొండ: పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి శుభం బన్సల్ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 5 నుంచి 9 వరకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ జరుగుతుందని తెలిపారు. ఓటింగ్ సమయంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. ఎన్నికల సిబ్బందికి ఏర్పాట్లుపై సూచనలు చేశారు. ఎండ తీవ్రత లేకుండా టెంట్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. సీఐ చంద్రమౌళికి పలు సూచనలు చేశారు. కౌంటర్లు పర్యవేక్షణ చేయాలని తహసీల్దార్ వరహాలకు ఆదేశించారు.



బ్యాలెట్ ఓటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్‌ఓ శుభం బన్సల్

పరీక్షిత్‌రాజు పరామర్శ

కురుపాం: మండల కేంద్రంలోని శివ్వన్నపేటకు చెందిన పురోహితుడు గణేష్ పాత్రో కొద్ది రోజుల కిందట గుండెపోటుతో మృతి చెందగా విషయం తెలుసుకున్న మన్యం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్ రాజు శనివారం కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులు గౌరీ, సంతోష్‌లను అడిగి తెలుసుకున్నారు. అన్ని విధాలా అండగా ఉంటామని వారికి భరోసానిచ్చారు. ఆయనతో పాటు కురుపాం ఎంపీపీ శెట్టి పద్మావతి, జిల్లా కో ఆప్షన్ సభ్యులు షేక్ నిషార్, నాయకులు కొదంగోళ్ల గౌరీశంకరరావు ఉన్నారు.



గణేష్‌పాత్రో కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న శత్రుచర్ల పరీక్షిత్ రాజు

విశ్వసనీయతకు నిదర్శనం వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టో



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం ప్రకటించిన వైఎస్సార్ సీపీ మేనిఫెస్టోపై ఇటు ప్రజాప్రతినిధులు, అటు ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. జగనన్న చెప్పాడంటే.. చేస్తారంతే... అని నమ్మకం ప్రజల్లో బలమైన నమ్మకం ఉందని వారు పేర్కొంటున్నారు. మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డే వస్తారని నమ్మకంగా చెబుతున్నారు. చంద్రబాబు మేనిఫెస్టోను ప్రజలు నమ్మరని వారు పేర్కొంటున్నారు. – సాక్షి నెట్‌వర్క్

ప్రజా సంక్షేమమే మేనిఫెస్టో



గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తాజా మేనిఫెస్టోలో ప్రజా సంక్షేమానికి తొలి ప్రాధాన్యత ఇచ్చారు. చంద్రబాబు మోసపూరిత మేనిఫెస్టో విడుదల చేశారు. జగనన్న చెప్పాడంటే...చేస్తారంతే...అన్న నమ్మకం అందరికీ ఉంది. ప్రజల నమ్మకమే మా మేనిఫెస్టో

– పాముల పుష్పశ్రీవాణి, ఎమ్మెల్యే

జగనన్న చెప్పాడంటే.. చేస్తారంతే...



వైఎస్సార్‌సీపీ ప్రకటించిన మేనిఫెస్టో విశ్వసనీయతకు నిదర్శనం. జగనన్న చెప్పాడంటే.. చేస్తాడంతే...అన్న నమ్మకం ప్రజల్లో ప్రబలంగా ఉంది. అందుకు తగ్గట్టుగానే మేనిఫెస్టో ప్రకటించారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా మేనిఫెస్టో ఉంది. పవిత్ర గ్రంథాలతో సమానంగా గౌరవించే ఎన్నికల హామీ పత్రంలో ప్రజలకు చేయగలిగిన పథకాలనే ప్రకటించడం జగనన్న గొప్పతనం. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కింది.

– విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్యే

ప్రజలు మెచ్చిన మేనిఫెస్టో



వైఎస్సార్‌సీపీ విడుదల చేసిన మేనిఫెస్టో అన్ని వర్గాల ప్రజలకు ఆమోదయోగ్యం. చెప్పారంటే చేస్తారంతే అన్న తీరున జగన్‌మోహన్ రెడ్డి మేనిఫెస్టోలో అంశాలను నేటి పరిస్థితులకు అనుగుణంగా సిద్ధం చేశారు. అమలు కాని, ప్రజలను మభ్యపెట్టే అంశాలకు తావు లేదు. గతంలో ఇచ్చిన హామీలను మరింత మెరుగుపరుస్తూ తాజా స్థితిగతులకు అనుకూలంగా అంశాలను ప్రజల ముందర ఉంచారు. ఇది ఆమోదయోగ్యమైన మేనిఫెస్టో

–పాలవలస విక్రాంత్, ఎమ్మెల్సీ, పాలకొండ

అన్ని వర్గాలకు ఉపయోగకరం



వైఎస్సార్‌సీపీ విడుదల చేసిన మేనిఫెస్టో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూర్చేదిగా ఉంది. బడుగు, బలహీన వర్గాలకు ఉపయుక్తం. చదువుకున్న పేద విద్యార్థులకు అమ్మ ఒడి ఓ వరంలాంటిది. వృద్ధులకు పింఛన్ల పెంపుదల, పేదలకు ఇళ్ల పట్టాల కొనసాగింపు పేదల పాలిట వరంలా ఉంటాయి. జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల గుండెల్లో జీవితాంతం కొలువై ఉంటారు. – బడే అప్పలనాయుడు, రిటైర్డ్ డైట్ ప్రిన్సిపాల్, వీఆర్‌పురం

ఎమ్మెల్యే కళావతికి హ్యాట్రిక్ విజయం ఖాయం

- వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లీలా ప్రసాదరావు

వీరఘట్టం: పాలకొండ నియోజకవర్గంలో అభివృద్ధి లేదని సినీ నటుడు పృథ్వీరాజ్ చేస్తున్న ప్రచారాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రి లీలా ప్రసాదరావు ఖండించారు. ఇటువంటి డైలాగులు సినిమాల్లో పనికొస్తాయని ప్రజలు విశ్వసించరని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో పాలకొండ ఎమ్మెల్యేగా కళావతి హ్యాట్రిక్ విజయం సాధిస్తారని పేర్కొన్నారు. నడుకూరులో ఆయన స్థానిక విలేకరులతో శనివారం మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ పాలనను విమర్శించే స్థాయి పృథ్వీరాజ్‌కు లేదన్నారు. శ్రీకాకుళం నుంచి శ్రీకాళహస్తి వరకు వైఎస్సార్‌సీపీ ప్రభంజనం తప్పదన్నారు. జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి నిమ్మక జయకృష్ణకు హ్యాట్రిక్ పరాజయం తప్పదని పేర్కొన్నారు. నిమ్మక జయకృష్ణ చేసిన అక్రమాలు ఈ ప్రాంత ప్రజలకు తెలుసునని అన్నారు. సీతంపేట ఐటీడీఏ అభివృద్ధి పనులు, నీరు – చెట్టు పనుల్లో రూ.కోట్లు ప్రజాధనాన్ని కాజేశారనే ఆరోపణలు ఆయనపై ఉన్నాయన్నారు. గతంలో రెండుసార్లు టీడీపీ టికెట్‌పై ఓడిపోయిన జయకృష్ణ ఇప్పుడు పార్టీ మారి జనసేనలోకి వెళ్లినంత మాత్రాన గెలవరన్నారు. మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో జయకృష్ణకు హ్యాట్రిక్ ఓటమి తప్పదన్నారు.



కర్రి లీలాప్రసాదరావు

తప్పుడు మాటలు మానుకో...

పాలకొండ రూరల్: పొత్తుల పార్టీల తరఫున ప్రచార కార్యక్రమంలో భాగంగా పాలకొండ వచ్చిన సినీ నటుడు పృథ్వీరాజ్ రాష్ట్ర ముఖ్యమంత్రిపై చేసిన వాఖ్యలను మండల సర్పంచుల సంఘం ఉపాధ్యక్షుడు తిర్లంగి ఉపేంద్రకుమార్ తీవ్రంగా ఖండించారు. శనివారం స్థానికంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సినిమా డైలాగులకు థియేటర్లలో చప్పట్లు పడొచ్చు, ప్రజా క్షేత్రంలో ఈ తరహా మాటలకు రాళ్లు పడతాయన్నారు. గతంలో వైఎస్సార్ సీపీలో ఉన్న ఆయనకు క్యారెక్టర్ లేకపోవడంతోనే పార్టీ ఆయనను పక్కన పెట్టిన విషయం గుర్తు చేసారు. పవిత్ర తిరుమల తిరుపతి దేవస్థానం పరిధిలో సేవ చేసేందుకు ఇచ్చిన అవకాశం నిలబెట్టుకోలేక అక్కసుతో ఇప్పుడు తప్పుడు మాటలు ఆడటం సమంజసం కాదన్నారు. ఎవరి హయాంలో అభివృద్ధి జరిగిందో ప్రజలకు తెలుసన్నారు. ఆయన వెంట సర్పంచులు, ఎంపీటీసీలు వి.జనార్దనరావు, ఎస్.గురునాయుడు, వి.కొండలరావు, ఎల్.శ్యాంసుందర్ తదితరులున్నారు.



నటుడు పృథ్వీ తీరును ఎండగడుతున్న మండల సర్పంచుల సంఘం సభ్యులు

జగనన్నతోనే సంక్షేమం – అభివృద్ధి



గుణదతీలేసలో ప్రజలకు ఓటు కోసం అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

కొమరాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో సంక్షేమంతో పాటు అభివృద్ధి జరుగుతుందని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని ఎన్నికల ప్రచారంలో భాగంగా గుణదతీలేస, కొరిశీల, కెమిశీల, పాలేం, వన్నాం గ్రామాల్లో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాధ్యమయ్యే హామీలు ఇచ్చి 99 శాతం హామీలు అమల చేసిన నాయకుడు జగనన్నే అన్నారు. గత ఐదేళ్ల జగనన్న ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందించామన్నారు. పార్టీకతీతంగా పథకాలు పంపిణీ జరిగిందన్నారు. గతంలో చంద్రబాబు ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా అమలు చేయలేదన్నారు. ఇప్పుడు మళ్లీ అమలు కాని హామీలిచ్చి మోసం చేసేందుకు మరోసారి చంద్రబాబు వస్తున్నారని తగిన గుణపాఠం చెప్పాలన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలంతా ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎంపీగా తనూజారాణి, ఎమ్మెల్యేగా తనకు అవకాశం ఇవ్వాలన్నారు. ప్రచారంలో ఎంపీపీ శెట్టి శ్యామల, జెడ్పీటీసీ ద్వారపురెడ్డి లక్ష్మి, మండల పార్టీ కన్వీనర్ డి.జనర్దనరావు, శెట్టి మధుసూదన్‌రావు, శివిని పీఏసీఎస్ అధ్యక్షుడు పప్పల గోపాలకృష్ణ, మండల సచివాలయ కన్వీనర్ యేగిరెడ్డి సింహచలం, కెమిశీల, గుణదతీలేస్ సర్పంచులు తాడింగి బీమయ్య, కండ్రక నందిని, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి గుణపాఠం చెప్పాలి

భామిని: రాష్ట్ర విభజన తరువాత ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర అన్యాయం చేసిన బీజేపీ, కూటమి అభ్యర్థులకు వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని సీపీఎం పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. అరకు పార్లమెంటు ఇండియా కూటమి అభ్యర్థిగా బరిలో ఉన్న పాచిపెంట అప్పలనర్సయ్య తరఫున వారు మండలంలో శనివారం ప్రచారం చేశారు. కార్మికులు, వ్యవసాయ కూలీల కడుపు కొడుతున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని కోరారు. కొరమ, కాట్రగడ, పెద్దదిమిలి, సతివాడ, పోలవరం గ్రామాల్లో సీపీఎం నాయకులు సిర్ల ప్రసాద్, జి.జగన్నాయకులు, కె.మిన్నారావు, కె.భాస్కరరావు, ప్రసాద్ ప్రచారం చేశారు.

ప్రజా ప్రభుత్వానికి మరో అవకాశం ఇవ్వండి

- వైఎస్సార్‌సీపీ మన్యం జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు

కురుపాం: సంక్షేమ పథకాల ద్వారా ప్రజల కష్టాలను తీర్చిన జగనన్న ప్రభుత్వానికి మరో అవకాశం ఇవ్వాలని పార్వతీపురం మన్యం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు అన్నారు. మండల కేంద్రంలోని పలు కాలనీల్లో ఆయన శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాలనీల ప్రజలు ఆయనకు నుదుట తిలకం దిద్ది ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రతీ ఇంటికి వెళ్లిన పరీక్షిత్‌రాజు ప్రజా ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించాలని కోరారు. ఐదేళ్లలో జరిగిన సంక్షేమాన్ని వివరించారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ఐదేళ్ల పాలనలో మంచి జరిగిందని భావిస్తే మరో అవకాశం ఇవ్వాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సార్వత్రిక ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి ఎంపీ అభ్యర్థిగా డాక్టర్ తనూజారాణి, ఎమ్మెల్యే అభ్యర్థిగా పాముల పుష్పశ్రీవాణిని గెలిపించాలన్నారు. ప్రచారంలో సర్పంచ్ గార్ల సుజాత, ఎంపీపీ పద్మావతి, జెడ్పీటీసీ సుజాత, ఎంపీటీసీలు వెలమల బంగారు నాయుడు, టి.వి.ఎస్.స్వామియాజులు, గౌడు సంతోషిరాణి, జిల్లా కో ఆప్షన్ సభ్యుల షేక్ నిషార్, వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు శెట్టి నాగేశ్వరరావు, వాణిజ్య విభాగం అధ్యక్షుడు డా.అంధవరపు కోటేశ్వరరావు, ఉప సర్పంచ్ షేక్ ఆదిల్, ఆకుల శీధర్, షేక్ నూరెల్లా, డి.రాము, రాయిపిల్లి శ్రీను పాల్గొన్నారు.



మండల కేంద్రంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు

శిక్షణ సద్వినియోగం కావాలి

సీతంపేట: శిక్షణా తరగతులు సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీఓ, పాలకొండ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ శుభం బన్సల్ సూచించారు. స్థానిక గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో ఎన్నికల ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు ఇస్తున్న శిక్షణా తరగతులను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎన్నికల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఏవైనా సందేహాలుంటే నివృత్తి చేసుకోవాలన్నారు.



శిక్షణా తరగతులు పరిశీలిస్తున్న పీఓ బన్సల్

ప్రకృతి వ్యవసాయం అమలు భేష్

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని రాయగడ జమ్ము, గొరడ, పెంగవ, వల్లాడ గ్రామాల్లో నాబార్డ్ సహకారంతో జట్టు ట్రస్ట్ ద్వారా అమలు చేస్తున్న జీవా కార్యక్రమం, ప్రకృతి వ్యవసాయ విధానాలు భేషుగ్గా ఉన్నాయని నాబార్డ్ అసిస్టెంట్ మేనేజర్ డాక్టర్ రేఖ ఎం గోనాల్ అన్నారు. పై గ్రామాల్లోని రైతులు ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేస్తున్న చిరుధాన్యాలు, శ్రీవరి, శ్రీరాగి పంటలతో పాటు అంతర పంటలు, వివిధ పండ్ల మొక్కల సాగు, అజొల్లా సాగు, దేశీ కోళ్ల పెంపకం, పశుమూత్ర సేకరణ శాలలు, బయోరిసోర్స్ సెంటర్, రైతు సేవా కేంద్రం తదితర వాటిని ఆమె శనివారం పరిశీలించారు. ఈ కార్యక్రమాలను రైతులంతా కొనసాగించి ఆర్థికంగా బలోపేతం కావాలని పిలుపునిచ్చారు. ఆమె వెంట నాబార్డ్ డీడీఎం టి.నాగార్జున, వాసన్ సంస్థ అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ ఎంఎల్ సన్యాసిరావు, జట్టు ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రహరాజ్, ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ తాడంగి జమ్మయ్య, కో డైరెక్టర్ ఎం.నూకం నాయుడు, జీవా కో ఆర్డినేటర్ ప్రభోద్, జి.మురళీ మోహన్ తదితరులు ఉన్నారు.



గొరడలో దేశీ నాటు కోళ్ల పెంపకం కేంద్రాన్ని పరిశీలిస్తున్న నాబార్డ్ అసిస్టెంట్ మేనేజర్

కుక్కల దాడిలో మహిళకు గాయాలు

జియ్యమ్మవలస: మండలంలోని బాసంగి పంచాయతీ ఎం.హరిపురం గ్రామానికి చెందిన గొడబ సరోజని (55) కుక్క కాటుకు గురై ఆస్పత్రి పాలైంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు... సరోజని శనివారం ఉదయం కాలకృత్యాల నిమిత్తం బయటకు వెళ్లగా ఒకేసారి నాలుగు కుక్కలు ఆమెపై పడి కాటేసాయి. చేసిది లేక అరవగా గ్రామస్తులు అంతా వెళ్లగా పారిపోయాయి. శరీరమంతా కరవగా వెంటనే చినమేరంగి సీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స చేసినప్పటికీ గాయాలు తీవ్రంగా ఉండడంతో పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. కుక్కలు వారం రోజుల్లో ముగ్గురు మహిళలపై దాడి చేసాయని, వాటిని తరలించే ఏర్పాట్లు చేయకపోతే రోజూ కుక్క కాటుకు గురవ్వాల్సిందేనని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



గాయపడిన సరోజని

సీజనల్ వ్యాధులపై తస్మాత్..

గరుగుబిల్లి: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి (డీఎంఓ) డా.టి.జగన్‌మోహన్‌రావు అన్నారు. మండలంలోని పెదగుడబ పంచాయతీ ఎస్‌ఆర్ పేటలో ఆకస్మికంగా శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి జ్వర లక్షణాలతో ఎవరైనా బాధపడుతున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఫీవర్ సర్వలెన్స్ సర్వే చేపడుతున్నారా లేదా అని సిబ్బందిని ప్రశ్నించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నందున వడదెబ్బకు గురికాకుండా ఉండేలా నీరు, మజ్జిగ, నిమ్మరసం, ఓఆర్ఎస్ తదితర ద్రావణాలు అధికంగా తీసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లల ఆరోగ్య రికార్డులను పరిశీలించారు. పిల్లలకు నీరు, గ్లూకోజ్ ద్రావణం తాగిస్తుండాలన్నారు. ఐరన్ సిరప్ క్రమం తప్పకుండా వారానికి రెండుసార్లు వేయించాలన్నారు. అలాగే 104లో మందులను, ఈసీజీ పరికరాలను తనిఖీ చేశారు. ఆయన వెంట వైద్యులు ఎస్.సంతోష్, ఈఓ సత్తిబాబు తదితరులున్నారు.



ఎస్‌ఆర్.పేటలో వడదెబ్బపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న డీఎంఓ జగన్‌మోహన్‌రావు